ప్రజాశక్తి
ఆదివారం 25 ఫిబ్రవరి 2024 5 అనంతపురం





ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి

మోడల్ స్కూల్స్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

మోడల్ స్కూల్స్‌లో ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి ఉతీర్ణత సాధించే విధంగా ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు కషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ మార్తాల వెంకట కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాడు పంగల్ రోడ్డులో ఉన్న ఆర్డీటీ స్కూల్ సమావేశం హాల్లో అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల నాలుగు జిల్లాల్లోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లు, మూడు సబ్జెక్టు టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టులను గుర్తించి అందులో ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా అధ్యయన తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఏరోజుకారాజు పరీక్షలను నిర్వహించి మార్కులను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని బి.వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, రాష్ట్ర కార్యాలయ సీబీఎస్ఇ కోఆర్డినేటర్ శ్రీలత, ఎఎంఒలు ధర్మకుమార్, శరత్, సత్యసాయి జిల్లా ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9 మందితో.. టిడిపి తొలి జాబితా

◆ ఉమ్మడి అనంతపురం జిల్లాలో అభ్యర్థుల ప్రకటన

◆ ముగ్గురు కొత్తవారు...ఆరుగురు పాతవారికే టికెట్లు

◆ పెనుకొండ, శింగనమల, కళ్యాణదుర్గంలో నిరసనలు

రాయదుర్గం



కాలవ శ్రీనివాసులు

ఉరవకొండ



పయ్యావుల కేశవ్

తాడిపత్రి



జెసి.అస్మిత్‌రెడ్డి

శింగనమల



బండారు శ్రావణిశ్రీ

కళ్యాణదుర్గం



అమిలినేని సురేంద్రబాబు

హిందూపురం



నందమూరి బాలకృష్ణ

రాప్తాడు



పరిటాల సునీత

పెనుకొండ



సవితమ్మ

మడకశిర



సునీల్‌కుమార్

రానున్న అసెంబ్లీ ఎన్నికలకు తెలుగుదేశం, జనసేనపార్టీలు ఉమ్మడి అభ్యర్థుల తొలిజాబితాను శనివారం ప్రకటించాయి. అధినేత చంద్రబాబు నాయుడు అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. మొదటి విడతగా 9 మంది పేర్లను ప్రకటించారు. పెనుకొండ, కళ్యాణదుర్గంలో కొత్త ముఖాలు తెరపైకి వచ్చాయి. మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న స్థానంలో ఆయన కుమారుడు బరిలోకి వచ్చారు. పెనుకొండ నుంచి సవితమ్మ, కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబు తొలిసారిగా అసెంబ్లీ బరిలో నిలవబోతున్నారు. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల, తాడిపత్రి, హిందూపురం, రాప్తాడు నుంచి 2019లో పోటీ చేసిన వారే ఆయా నియోజకవర్గాల నుంచి 2024లో కూడా పోటీ చేయబోతున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ స్థానాల్లో టిడిపి అభ్యర్థులను ప్రకటించింది. ఖరారైన తొమ్మిది మందిలో ముగ్గురు కొత్తవారికి అవకాశం లభించగా ఆరుగురు పాతవారికే అవకాశం దక్కింది. కాగా టికెట్ల ప్రకటన అనంతరం నాలుగు నియోజకవర్గాల్లో నిరసనలు పెల్లుబికాయి. పెనుకొండ, కళ్యాణదుర్గం, మడకశిర, శింగనమల నియోజకవర్గాల్లో ఈ నిరసనలు వెలువడ్డాయి. ఇదిలా ఉండగా టిక్కెట్టు ఖరారైన నేతల ఇళ్ల వద్ద పెద్దఎత్తున సంబరాలు జరిగాయి.

ముగ్గురు కొత్తవారు...ఆరుగురు పాతవారు..

అనంతపురం జిల్లా పరిధిలో ఐదు స్థానాలు, సత్యసాయి జిల్లా పరిధిలో నాలుగు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో ముగ్గురు అభ్యర్థులు కొత్తవారుకాగా తక్కిన ఆరు స్థానాల్లో పాతవారికే అధిష్టానం అవకాశం కల్పించింది. అనంతపురం జిల్లాలో చూస్తే రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గానికి కాలవ శ్రీనివాసులుకు మరోమారు అవకాశం దక్కింది. ఉరవకొండకు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పయ్యావుల కేశవ్‌కు మళ్లీ అవకాశం లభించింది. కళ్యాణదుర్గం నియోజకవర్గంకు అమిలినేని సురేంద్రబాబుకు కొత్తగా అవకాశం కల్పించింది. శింగనమల నియోజకవర్గానికి బండారు శ్రావణికి రెండోసారి అవకాశం దక్కింది. తాడిపత్రి నుంచి రెండవ సారి జెసి.అస్మిత్‌రెడ్డి అధిష్టానం బరిలో నిలిపింది. ఇక సత్యసాయి జిల్లాలో చూస్తే రాప్తాడుకు మాజీ మంత్రి పరిటాల సునీతను ప్రకటించారు. మడకశిరకు మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్‌కుమార్‌కు అవకాశం కల్పించారు. హిందూపురం సిట్టింగ్ ఎమ్మెల్యే బాలకృష్ణ మరోసారి పోటీలో నిలిపారు. పెనుకొండకు బికె.పార్థసారధి కాకుండా ఈసారి సవితమ్మకు అవకాశం కల్పించింది.

నాలుగు చోట్ల నిరసనలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి అభ్యర్థుల ప్రకటన అనంతరం నాలుగు నియోజకవర్గాల్లో నిరసనలు వ్యక్తమయ్యాయి. 14 నియోజకవర్గాలకుగానూ తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను టిడిపి ప్రకటించింది. ఇందులో పెనుకొండ నియోజకవర్గంలో సత్యసాయి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధికి కాకుండా సవితమ్మకు టిక్కెట్టు ఖరారు చేయడంపై బికె.పార్థసారధి మద్దతుదారులు నిరసనలు వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పార్టీ కార్యాలయం వద్ద ఫ్లెక్సీలను తగులబెట్టి నిరసన చేపట్టారు. కళ్యాణదుర్గంలో అమిలినేని సురేంద్రబాబుకు ప్రకటించడం పట్ల మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వర నాయుడు మద్దతుదారులు స్థానికేతరులకు టిక్కెట్టు ఖరారు చేశారంటూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. శింగనమలకు నియోజకవర్గం టిక్కెట్టు బండారు శ్రావణికి కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి మద్దతు దారులు అనంతపురం జిల్లా కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యాలయంపైకి రాళ్లు రువ్వి, ఫర్నీచర్ ధ్వంసం చేశారు.

పెనుకొండలో తమ్ముళ్ల ఆగ్రహజ్వాల

◆ బికెకు మద్దతుగా నిరసన ◆ టిడిపి ఫ్లెక్సీలు, కరపత్రాల దహనం



పెనుకొండ టిడిపి కార్యాలయం వద్ద టిడిపి కరపత్రాలను దహనం చేస్తున్న బికె మద్దతుదారులు

పెనుకొండ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి టికెట్ల కేటాయింపు వ్యవహారం పెనుకొండ టిడిపిలో తీవ్ర అలజడిని రేపింది. సీనియర్ నాయకుడు, టిడిపి హిందూపురం జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారధికి టికెట్టు ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఆయన మద్దతుదారులు తీవ్ర స్థాయిలో నిరసన తెలిపారు. శనివారం నాడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన జాబితాలో బికె పేరు లేకపోవడాన్ని తెలుసుకున్న ఆయన మద్దతుదారులు పెనుకొండలోని టిడిపి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన టిడిపి ఫ్లెక్సీలు, జెండాలను చించివేశారు. కరపత్రాలను రోడ్డుపై వేసి దహనం చేశారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ టిడిపి కష్టకాలంలో ఉన్న సమయంలో బికె.పార్థసారథి పార్టీ కోసం కృషి చేశారని చెప్పారు. వివాదరహితుడిగా మంచి పేరు ఉన్న ఆయన్ను కాదని ఇతరులకు టికెట్టు ఇవ్వడం సరికాదన్నారు. అధిష్టానం పార్థసారథిని పిలిపించి టికెట్ విషయంలో చర్చించక పోవడం దారుణం అన్నారు. అధిష్టానం పునరాలోచించి ఎమ్మెల్యే అభ్యర్థిగా బికెకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన న్యాక్ కమిటీ పరిశీలన

కళాశాల నిర్వహణపై సంతృప్తి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియులో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న న్యాక్ పీర్ కమిటీ పరిశీలన శనివారంతో ముగిసింది. యూనివర్సిటీలోని పలు విభాగాలను పరిశీలించి సమావేశాల్లో పాల్గొన్నారు. న్యాక్ పీర్ కమిటీ బందం మొదటి రోజు హైయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఉపకులపతి ఆచార్య జివిఎస్.శ్రీనివాస రావు, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ అధ్వర్యంలో కాన్పరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. అనంతరం న్యాక్ కమిటీ బందం సభ్యులు మూడు గ్రూపులుగా విడిపోయి కళాశాలలోని అన్ని విభాగాలను పరిశిలించారు. రెండవ రోజు కాన్పరెన్స్ హాలులో సమావేశం అనంతరం యూనివర్సిటీలోని అన్ని కార్యాలయాల్లో డైరెక్టర్లతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆడిటోరియంను సందర్శించారు. మూడవ రోజు శనివారం నాడు డైరెక్టర్లు భోధన, భోధనేతర సిబ్బంది, విద్యార్థులతో న్యాక్ బందం మఖాముఖి సమావేశం నిర్వహించింది. మూడు రోజుల పర్యటన అనంతరం న్యాక్ బృందం జెఎన్‌టియు కళాశాలలోని అన్ని బాగున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎం.విజయ కుమార్ , రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, ఐక్యూ సి డైరెక్టర్ జివి.సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవ రెడ్డి, కిరణ్మయి, సి.శోభా బిందు. పద్మ సువర్ణ, ఎ.సురేష్ బాబు, బి.ఈశ్వర్ రెడ్డి, యన్.విశాలి, పి.సుజాత, వి.చిత్ర, అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, కళాశాల విభాగాల అధిపతులు భువన విజయ, డాక్టర్ కెఎఫ్.భారతి, డాక్టర్ ఎం.రామ శేఖరరెడ్డి, డాక్టర్ కె.కళ్యాణి రాధ, డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ జి.మమత, అజిత పాల్గొన్నారు.



న్యాక్ బృందం సభ్యులతో జెఎన్‌టియు అధికారులు

గ్రూప్- 2 పరీక్షకు సర్వం సిద్ధం

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు : కలెక్టర్


ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఆదివారం నాడు నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్- 2 పరీక్ష కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. నేడు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటల నుంచి 10 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. గ్రేస్ పీరియడ్‌తో కలిపి 10:15 గంటల వరకు అనుమతించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 111 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 32,391 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి 38 మంది రూట్ ఆఫీసర్లు, 111 మంది లైజన్ ఆఫీసర్స్‌ను నియమించామన్నారు. పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, పుస్తకాలు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. దివ్యాంగుల కోసం గ్రౌండ్ ఫ్లోర్ లోనే కేంద్రాలను ఏర్పాట్లు చేశామని తెలిపారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ నంబర్ 08554-220009 అందుబాటులో ఉంటుందని, ఏవైనా సందేహాలు ఉంటే సంప్రదించాలని కోరారు.

165కు పైగా స్థానాల్లో గెలుస్తాం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో 165 పైచిలుకు స్థానాల్లో టిడిపి, జనసేన కూడమి విజయం సాధించడం తథ్యమని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ధీమా వ్యకం చేశారు. టిడిపి జాతీయ అధినేత, జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ కలిసి తొలి విడత అభ్యర్థుల జాబితా విడుదల చేసిన సందర్భంగా శనివారం రాయదుర్గంలో మీడియాతో మాట్లాడుతూ నిండు పున్నమి నాడు తమ అధినాయకుడు చంద్రబాబు ఉమ్మడి జిల్లాల అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితా విడుదల చేయడం శుభపరిణామం అన్నారు. ఇది తమ పార్టీ అప్రతిహత విజయానికి నాంది పలుకుతుందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన చారిత్రక అవసరాన్ని అన్నివర్గాల ప్రజలు గుర్తించారన్నారు. తప్పక ఏకపక్షంగా తమ కూటమికి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. జగన్ ఓడిపోవడానికి, పారిపోవడానికి సిద్ధమనే ప్రజల్లో మాట వస్తోందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో కనీసం 50 వేల మెజారిటీతో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాగా స్థానిక వినాయక కూడలిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, డి.హీరేహాల్ కన్వీనర్ యు.హనుమంతురెడ్డి, రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, గుమ్మగట్ట క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, మైనార్టీ విభాగం నాయకులు మహబూబ్‌బాషా, బీసీ సెల్ నాయకులు పూజారి తిప్పయ్య, మహిళా విభాగం నాయకురాలు బండి భారతి, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కమనీయం..రంగనాథుని కళ్యాణం

వైభవంగా రథోత్సవం



రంగనాథస్వామి రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి, మాణిక్య రంగనాథస్వామి రథోత్సవం శనివారం వైభవంగా సాంది. తొమ్మిది రోజులపాటు జరిగే స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి కళ్యాణం కమణీయంగా నిర్వహించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి పూజలు నిర్వహించారు. ఉత్సవ ప్రధాన అధికారి డి.పాండురంగారెడ్డి, ఇఒ వి.దేవదాసు, మాణిక్య రంగనాథ స్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షులు జీవీ.రామన్, కార్యదర్శి జయవరం అశ్వర్థ రంగయ్య, సీఐలు ఎం.వెంకటరామిరెడ్డి, గణేష్, తదితరులు రథాన్ని లాగి లాంఛనంగా రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎడ్లబండ్లను ప్రత్యేకంగా అలంకరించుకుని తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ఆలయం వెలుపల వెలసిన దుకాణాలు కిటకిటలాడాయి. దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా గుంతకల్లు డీఎస్పీ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాణిక్య రంగనాథస్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ కోశాధికారి ముత్యాల వెంకటరంగయ్య, సహాయ కార్యదర్శిలు ముత్యాల నాగరాజయ్య, మంచికంటి రామరంగయ్య, సభ్యులు ముత్యాల రంగస్వామి, కె.కిషోర్‌బాబు, కె.సుదర్శన్, ఆర్.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో కొనసాగుతున్న వాలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా శనివారం విడపనకల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పేదలకు అన్ని పథకాల పంపిణీలో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని వారు చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ఇంతటి సేవావారికి చేస్తున్న వాలంటీర్లకు సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన అవార్డులతో మరింత బాధ్యత వాలంటీర్లపై పెరిగిందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవడంతో పాటు గ్రామాల్లో సంక్షేమాన్ని సకాలంలో వర్తింపజేసి, వారి అభిమానాన్ని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న జెసిఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపిడిఒ, సర్పంచులు, ఎంపిటిలు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం, నాయకులు

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని 47, 48వ డివిజన్ల పరిధిలో ఉన్న సోమనాథ్‌నగర్ ప్రధాన రహదారిపై ప్రత్యేక గ్రాంట్ నిధులు రూ.1.26 కోట్లతో వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను మేయర్ మహమ్మద్ వసీం శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా మేయర్ మహమ్మద్ వసీం మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో 15వ ఆర్థిక నిధులతోపాటు, గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయానికి విడుదలైన రూ.20లక్షలతోపాటు మంజూరైన స్పెషల్ గ్రాంట్ రూ.25 కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి కార్పొరేటర్లు ఇఇ సూర్యనారాయణ, డిఇఇ రవీంద్రారెడ్డి, ఎఇ శంకర్ తోపాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కామ్రేడ్ ఖాజా ఆశయాలు కొనసాగిస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతపురం కలెక్టరేట్ : కార్మికులు, కష్టజీవుల కోసం నిరంతరం పాటుపడిన కామ్రేడ్ ఖాజా ఆశయాల సాధనకు కృషి చేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఖాజా వర్ధంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాజా తన కుటుంబం కోసం ఆటో నడుపుతూ జీవనం సాగించేవారన్నారు. అయితే ప్రజా పోరాటాలకు సిపిఎం ఏ పిలుపు ఇచ్చినా పాల్గొని సమస్యల పరిష్కారానికి పోరాడేవారని గుర్తు చేశారు. ఖాజా మరణించి తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా నగరంలోని కమలానగర్, డిసిఎంఎస్ రోడ్డు ,శ్రీనివాస నగర్, ఖాజానగర్‌లో ఇప్పటికీ ప్రజలు గుర్తించుకుంటున్నారంటే ఆయన గొప్పతనం అన్నారు. అందుకే నిజాయితీగా, నిబద్ధతగా, ప్రజల పట్ల విశ్వాసంతో పని చేస్తే ప్రజలు తమ గుండెల్లో ఉంచుకుంటారని ఖాజా నిరూపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నగర కమిటీ సభ్యులు ప్రకాష్, వలి, జీవా, ప్రసాద్, సురేష్, ఇస్మాయిల్, ఇమామ్ బాషా, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

ఆత్మకూరు : ఎన్నికల వేళ సమస్యాత్మక గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, రికార్డులతోపాటు రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాల్లోని తాజా పరిస్థితులపై ఆరాతీశారు. గ్రామాల్లో అశాంతి, అలజడులు, సమస్యలకు కారణమయ్యే వారిపై నిరంతర నిఘా వేయాలన్నారు. గట్టిగా పని చేయాలన్నారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటెన్ చేసే ప్రతి రికార్డునూ సమీక్షించారు. కేసులు త్వరితగతిన పూర్తీ చేయాలన్నారు. దొంగతనాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ నేరాలలో సీజ్ చేసిన వాహనాలను వెంటనే డిస్పోజల్ చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం పోలీసుస్టేషన్‌కు వచ్చిన పిటీషనర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మునీర్ ఉన్నారు.

సంక్షేమ ఫలాలపై ఇంటింటికీ వివరించాలి : ఎంపీ



ఒంటిమిద్దిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం : సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని ఎంపీ రంగయ్య పిలుపునిచ్చారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిది గ్రామంలో కౌసర్, ఆనందపుగారి సురేష్, ఎర్రిస్వామి, మంజు ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు వాటి పనితీరును క్షుణ్ణంగా వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే ఆంధ్రప్రదేశ్ సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. ఇందుకోసం అన్ని వర్గాల ప్రజలు ఏకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నార్పలలో హైడ్రామాకు తెర

ప్రశాంతంగా కూతలేరు వంతెన ప్రారంభం

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని కూతలేరు నదిపై వంతెన, డ్రెయినేజీ కాలువ ప్రారంభం ఎట్టకేలకూ శనివారం ప్రశాంతంగా ముగిసింది. దాదాపు రూ.2.40కోట్లతో నిర్మించిన వంతెన, డ్రెయినేజీ ప్రారంభంపై శుక్రవారం రాత్రి నుంచి హైడ్రామా కొనసాగిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవ శిలాఫలకం ఏర్పాటుపై స్థానిక నాయకుల పేర్లు లేవని, ప్రొటోకాల్ పూర్తిస్థాయిలో పాటించలేదని ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్న విషయం తెలిసిందే. ఎట్టకేలకూ నాయలకు మధ్య సయోధ్య కుదిర్చి శనివారం ఉదయం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి వంతెనతోపాటు డ్రెయినేజీ కాలువను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ధాల నుంచి కూతలేరు వంకపై నూతన వంతెన నిర్మాణం సమస్యాత్మకంగా మారి ప్రతిసారి శంకుస్థాపనలు చేయడం, ఆగిపోవడం జరుగుతూ వచ్చిందన్నారు. ఈనేపథ్యంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన మాట మేరకు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఉయ్యాలకుంట క్రాస్ నుంచి కూతలేరు వంతెన వరకూ డ్రెయినేజీ కాలువ నిర్మాణాన్ని కూడా పూరి చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ శ్రీధర్, నార్పల ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రఘునాథరెడ్డి, నాగేశ్వరరావు, లోకనాథ్‌రెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, మొరుసు రమణారెడ్డి, మొరుసు సంజీవరెడ్డి, శంకర్‌యాదవ్, కాటమయ్య, రాజారెడ్డి, కేశవరెడ్డి, సాబీరా, ఆర్అండ్‌బి అధికారులు, బాలకాటమయ్య, ప్రసాద్‌రెడ్డి, కావ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ రవీంద్రనాథ్‌రెడ్డి, వర్క్ ఇన్స్‌పెక్టర్ సికిందర్, తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

కాంగ్రెస్ సభను విజయవంతం చేద్దాం

మాజీమంత్రి శైలజానాథ్

ప్రజాశక్తి-గార్లదిన్నె

జిల్లాకేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఈనెల 26న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీమంత్రి సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. శనివారం గార్లదిన్నె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి, వైసిపిలు గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని చూపుతూ పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. ఆ పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాగా పిసిసి అధ్యక్షురాలు షర్మిల హాజరుకానున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బండపల్లి ప్రతాపరెడ్డి, కాంగ్రెస్ కన్వీనర్ ఓబిరెడ్డి, అధికార ప్రతినిధి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి శైలజానాథ్

ఉరవకొండ : అనంతపురం జిల్లాకేంద్రంలో ఈనెల 26న తలపెట్టిన రాష్ట్ర పునర్నిర్మాణ పోరాట సభను విజయవంతం చేద్దామని సిపిఎం, కాంగ్రెస్, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ కూటమిగా జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం ప్రాంగణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు షర్మిల, ఎఐసిసి కమిటీ సభ్యులు రఘువీరారెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గత పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రజా పరిపాలన నిర్వీర్యం చేసి స్వార్థ రాజకీయాల చేశాయని విమర్శించారు. నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్నా చేపడితే జవాబు చెప్పాల్సిన వైసిపి ప్రభుత్వం పోలీసుల అండతో అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్టేనన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు కలిసి వచ్చే ప్రజాసంఘాలు, కులసంఘాలు పెద్దఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోనియా సీనా, బ్యాళ్ల.ప్రసాద్, అబ్బాస్, శ్రీకాంత్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : అనంతపురంలో ఈనెల 26న నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ సభను విజయవంతం చేయాలని రాయదుర్గం ఇన్‌ఛార్జి కోరి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ అనంతపురంలో మొదటిసారి నిర్వహిస్తున్న సభకు మండలంలోని మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

దళిత, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలను రూపొందించి అమలు చేయాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో విలేకరులు, కార్యాలయాలపై వైసిపి మూకలు దాడులు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై భౌతిక దాడులు చేసిన వైసిపి మూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నాయకులు ఎల్లిపోగుల ఆనంద్, కెవిపిఎస్ జిల్లా నాయకులు జగ్గలి రమేష్, సంచార జాతుల రాష్ట్ర నాయకులు వై.శ్రీనివాసులు, ఎంఆర్‌పిఎస్ నాయకులు వెంకటేష్, మాల మహానాడు నాయకులు రామాంజినేయులు, ఎంఎస్‌సి నాయకులు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రతిఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

నార్పల : ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే జల్‌జీవన్ మిషన్ లక్ష్యమని ఎంపిడిఒ రాముడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్ గ్రామ కమిటీలపై మండల వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జిల్లా కోఆర్డినేటర్ నరేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఇంటికీ తాగునీరు అందించడం జల జీవన్ ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామైక్య సంఘాల మహిళలతో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామాల్లో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనుల పర్యవేక్షణ చేసి ప్రతి ఇంటికీ నీరు అందే విధంగా చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి, మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, ఎపిఎం తిప్పమ్మ, వర్క్‌ఇన్స్‌పెక్టర్ సికిందర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గ్రామ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గొడవలు సృష్టించొద్దు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు సృష్టించొద్దని శిక్షణ డీఎస్పీ హేమంత్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గొడవలు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారని, మీరు ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. మట్కా, పేకాట, మద్యం గొలుసు దుకాణాలు వంటి తదితర నిర్మూలన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న శిక్షణ డీఎస్పీ హేమంత్‌కుమార్

మోడల్ స్కూల్స్ జేడీకి అభినందనలు

అనంతపురం : జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒగా పని చేసి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ జాయింటర్ డైరెక్టర్ వెంకటకృష్ణారెడ్డి శనివారం జిల్లాకు వచ్చిన సందర్భంగా జిల్లా ప్రయివేట్ పాఠశాలల సంఘం కలిసి అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా పుష్పగుచ్చాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వరలక్ష్మి, జిల్లా ప్రయివేట్ పాఠశాలల సంఘం గౌరవాధ్యక్షులు గంగాధర్‌యాదవ్, జిల్లా అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి రామచంద్ర, వ్యవస్థాపక సిఆర్ఒ రవిచంద్రారెడ్డి, నగర గౌరవాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, నగర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ కానుక, సంక్షేమ పథకాల అమలుపై వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సుబ్బరాజు, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సాయిశ్రీ, హరిత, వెంకటనారాయణ, దస్తగిరి, శివ, రుద్ర, హరిబాబు, సాయిరాం, రామ్మోహన్, హేమంత్, అమర్నాథ్, సీనప్ప, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

అనంతపురం : ఆర్టీసీ బస్టాండ్‌లో తినుబండారాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్ హెచ్చరించారు. ప్రయాణికులు, వినియోగదారుల ఫిర్యాదుల నిమిత్తంతోపాటు అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం అనంతపురంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలను ఆకస్మికంగా నిఖీ చేశారు. ఇందులో భాగంగా ముదిరించిన ధర కవంటే అధిక ధరలకు తినుబండారాలు విక్రస్తున్నట్లు గుర్తించి ఆరు కేసులు నమోదు చేశారు. అనంతరం ప్రయాణికులు మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్‌గౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ప్రార్థనలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని ముస్లిం శ్మశాన వాటికలో ఆదివారం నిర్వహించనున్న ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేయర్ మహమ్మద్ వసీం సలీం ఆదేశించారు. షబ్ ఏ బరత్ పండుగను పురస్కరించుకుని శ్మశాన వాటికలో చేస్తున్న ఏర్పాట్లను డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డితో మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షబ్ ఏ బరత్ పండుగకు పెద్దఎత్తున ముస్లింలు శ్మశాన వాటికలో ప్రార్థనలకు హాజరవుతారని వెల్లడించారు. ప్రధానంగా నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట ప్రార్థనలు చేసేందుకు వస్తారని దీంతో పెద్ద ఎత్తున లైటింగ్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐదు రోజులుగా పనులు కొనసాగిస్తున్నట్లు అధికారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. నేటి సాయంత్రంలోపు పనులన్నీ పూర్తి చేయాలని తెలిపారు. నగర శివారులోని హెచ్ఎల్‌సి కెనాల్ వద్ద ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో కూడా పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, కార్పొరేటర్లు అబూ, ఇసాక్, రహంతుల్లా, బాబా, శంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం

లింగవివక్షపై అవగాహన ర్యాలీ

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న అమిద్యాల గ్రామంలో లింగవివక్ష నిర్మూలనపై అవగాహన హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ ఆడ,మగ బిడ్డలు సమానమే అన్నారు.కొంతమంది మగపిల్లల మీద మోజుతో ఆడపిల్లలను చులకన చేయడం సరికాదన్నారు. ఇంకొందరు గర్భస్థ సమయంలో స్కానింగ్ చేయించి ఆడబిడ్డ అని తెలిసి అబార్షన్ చేయిస్తున్నారన్నారు. తద్వారా ఆడ,మగ పిల్లల నిష్పత్తిలో వ్యత్యాసాలు పెరిగి సమాజంలో అనేక సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందని చెప్పారు. కావున తల్లిదండ్రులు ఇద్దరినీ సమానంగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ.భారతి, ఎఎన్ఎం కోమల, సీఓ భగవాన్‌దాస్, అంగన్వాడీ రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మద్దతుధరతో పప్పుశనగ కొనుగోళ్లు

అనంతపురం : జిల్లాలో రబీ 2023-24 సీజన్‌లో రైతులు పండించిన పప్పుశెనగను రైతుల నుంచి ప్రభుత్వ మద్దతు ధరపై క్వింటా రూ.5,440 పప్పుశెనగ కొనుగోలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాఫెడ్ ద్వారా అనుమతి ఇచ్చినట్లు ఎపి మార్కెట్ ఫెడ్ మేనేజర్ పెన్నీశ్వరీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలో పప్పుశెనగ పండించిన రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా తమ పంటను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కదిరిదేవరపల్లి రైలు రద్దు గడువు పొడిగింపు

రాయదుర్గం : కదిరిదేవరపల్లి నుంచి తిరుపతి మధ్య ప్రయాణించే ట్రైన్ నెంబర్ 07589/07590 రైలు కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు మధ్య మార్చి మొదటి తేదీ వరకూ రద్దు చేసిన గడువును ఏప్రిల్ మొదటి తేదీ వరకూ పొడిగించినట్లు నైరుతి రైల్వే అసిస్టెంట్ ట్రాన్స్‌ఫర్టేషన్ మేనేజర్ బి.ఎల్.శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు ప్రయాణికులు ఈ రద్దు గడువు పొడిగించిన విషయాన్ని గమనించాలని ప్రకటనలో కోరారు.

ఎముకల పటుత్వ పరీక్ష శిబిరం

అనంతపురం : ఎస్‌కెయు ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఎస్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో శివసాయి ఆసుపత్రి, అపెక్స్ ఫార్మాస్యూటికల్, మేఏర్ ఆర్గానిక్స్ ప్రయివేట్ లిమిటెడ్ సహకారంతో ఆకుతోటపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత ఎముకల పటుత్వ శిబిరం శనివారం రెండోరోజు కొనసాగింది. ఇందులో భాగంగా గ్రామస్తుల ఎముకల భలాన్ని పరీక్ష చేసి సమస్యలకు తగ్గ పరిష్కారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు టి.చైతన్య, సుంకు గౌరీశంకర్ ఎముకల సమస్యలకు తగిన సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు రిజిస్ట్రార్ ఎంవి.లక్ష్మయ్య, ఎస్‌కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధరరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ జి.సోమశేఖర్, ఆకుతోటపల్లి సర్పంచి సి.గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

రాజకీయ కాక



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ఆసన్నం అవుతుండటంతో రాజకీయ వాతవరణం వేడెక్కుతోంది. ఎన్నికల ఏర్పాట్లకు సిద్ధమవుతూనే అభ్యర్థులను రాజకీయపార్టీలు ఖరారు చేస్తూ పోతున్నాయి. ఇది కూడా రాజకీయ వాతావరణం వెడెక్కుతోంది. ప్రధాన పార్టీల్లో అభ్యర్థుల ఖరారు పూర్తవుతున్నాయి. దీంతో ఒక్కో అసెంబ్లీ స్థానంపై స్పష్టత ఏర్పడుతోంది. ఇప్పటికే వైసిపి ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. టిడిపి తాజాగా 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించింది. ఈ ప్రకటనలతో ప్రధాన పార్టీల అభ్యర్థులెవరన్న దానిపై స్పష్టత వస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, శింగనమల, మడకశిర నియోజకవర్గాల్లో రెండు పార్టీల నుంచి అభ్యర్థులు ఖరారైన వాటిల్లో ఉన్నాయి. తక్కిన వాటటిల్లోనూ త్వరలోనే వైసిపి అభ్యర్థులను ప్రకటించే సూచనలు కనిపిస్తున్నాయి. అధికారిక ప్రకటన రానిచోట్ల తమ పేర్లను ఖరారు చేయించుకోవడానికి ఆశావాహులు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రకటనలతో మొత్తంగా ఈ వారంలో ఎన్నికల వాతావరణం మరింత ఊపందుకుంటోంది. ఇప్పటికే ప్రధాన పార్టీల నేతల ప్రచార కార్యక్రమాలు పాల్గొంటున్నారు. గత వారంలో వైసిపి రాయాలసీమ స్థాయి సభను పెద్దఎత్తున నిర్వహించింది. భారీ జనసమీకరణ చేపట్టి విజయవంతమైందని ఆ పార్టీ నేతలు సంభరపడుతున్నారు. టిడిపి కూడా వచ్చే వారంలో సభలను నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వచ్చే వారంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాన్ని అనంతపురం నుంచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. దీనికి వామపక్ష పార్టీలు హాజరుకానున్నాయి. కేంద్రంలోని మతత్వ బిజెపికి వ్యతిరేకంగా ఈ సభను నిర్వహిస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అదే విధంగా రాష్ట్ర విభజన హామీలను అమలు చేయించే విషయంలో ఇక్కడి పార్టీలైన టిడిపి, వైసిపిలు విఫలం చెందాయని విమర్శిస్తున్నారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సభను నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మరోవైపు అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో బిజీబిజీ అయింది. పోలింగ్ కేంద్రాల పరిశీలన కొనసాగుతోంది. అదేవిధంగా స్ట్రాంగ్ రూమ్‌లతోపాటు, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు ఏ విదంగా ఉండాలన్న పరిశీలనను రెండు జిల్లాలోనూ కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. అదే విధంగా ఎంత మంది ఉద్యోగులు అవసరమవుతారన్న అంచనాలను రూపొందిస్తున్నారు. మొత్తంగా రాజకీయ పార్టీలు మరోవైపు అధికారిక ఏర్పాట్లు రెండు సమాంతరంగా కొనసాగుతున్నాయి. ఇక ఈవారంలో జర్నలిస్టు దాడికి సంబంధించిన అంశం ప్రధాన చర్చనీయాంశమైంది. ఫొటో జర్నలిస్టుపై వైసిపి బహిరంగ సభలో జరిగిన దాడిపై జర్నలిస్టులు, రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు నిరసనలు చేపట్టాయి. జర్నలిస్టులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ నిరసనలు కొనసాగాయి. రాజకీయాల్లాగానే వాతావరణమూ వెడెక్కుతోంది. వేసవి తాపం పెరుగుతోంది. దీంత గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికే అనేక గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించే పరిస్థితులు వస్తున్నాయి. విద్యుత్ సమస్యలతో పంటలకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం నేతలు, రాజకీయాల్లో బిజీ అయిన నేపథ్యంలో రైతుల సమస్యలు, తాగునీటి సమస్యలపై పెద్దగా చర్చ రాకుండా ఉండిపోతున్నాయి.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

I.A.NO:312/2023 in O.S.NO:31/2023

Between:

తాటి నాగరాజు S/o తాటి కుల్లాయప్ప D.No:14/210, కోట వీధి, యాడికి గ్రామము మరియు మండలము, అనంతపురం జిల్లా. ...అర్జీదారుడు/వాది

మరియు

బాల శ్యామలా దేవి ...రెస్పాండెంట్/ప్రతివాదులు

To (రెస్పాండెంట్/ప్రతివాది)

బాల శ్యామలా దేవి W/o లేట్ బాల సతీష్ బాబు D/o అంగడి సుబ్బారాయుడు, D.No:15/237-A, లాలెప్ప కాలనీ, యాడికి గ్రామము మరియు మండలము, అనంతపురం జిల్లా.

రెస్పాండెంట్/ ప్రతివాదికి నోటీసు

పై అర్జీలో అర్జీదారుడు తాటి నాగరాజుపై దావాలో తీర్పుకు ముందు నీ ఆస్తిని జప్తుచేయమని నీ మీద పై కోర్టులో అర్జీని దాఖలు చేసి ఉన్నారు. సదరు అర్జీ మీ హాజరు నిమత్తము కోర్టు వారు 19/03/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున పై తేదిన మీరు కోర్టు ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు హాజరు అయి మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును.లేని యెడల కోర్టు వారు దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కె.రమేష్ నాథ రెడ్డి,
వై.హనీఫ్ బాష,
న్యాయవాదులు, తాడిపత్రి &
జెడ్.సతీష్, న్యాయవాది, గుత్తి.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.NO:31/2023

Between:

తాటి నాగరాజు S/o తాటి కుల్లాయప్ప D.No:14/210, కోట వీధి, యాడికి గ్రామము మరియు మండలము, అనంతపురం జిల్లా. ...వాది

మరియు

బాల శ్యామలా దేవి ...ప్రతివాది

To (ప్రతివాది)

బాల శ్యామలా దేవి W/o లేట్ బాల సతీష్ బాబు D/o అంగడి సుబ్బారాయుడు, D.No:15/237-A, లాలెప్ప కాలనీ, యాడికి గ్రామము మరియు మండలము, అనంతపురం జిల్లా.

ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలో తాటి నాగరాజు తనకు నీ నుంచి రావలసిన బాకీ మొత్తమును రాబట్టుకొను నిమిత్తము నీ మీద పై కోర్టులో దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావా మీ హాజరు నిమత్తము కోర్టు వారు 19/03/2024 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. కావున పై తేదిన మీరు కోర్టు ఎదుట స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ ఉదయం 10:30 గంటలకు హాజరు అయి మీ అభ్యంతరములు తెలుపుకొనవచ్చును.లేని యెడల కోర్టు వారు దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కె.రమేష్ నాథ రెడ్డి,
వై.హనీఫ్ బాష,
న్యాయవాదులు, తాడిపత్రి &
జెడ్.సతీష్, న్యాయవాది, గుత్తి.

నోటీసు

అనంతపురం జిల్లా, ఇటికలపల్లి E.శ్రీరాములు కు, సర్వే నెంబరు 196/1,AC.6.08 Cents లో భూమిని E.శ్రీరాములు 1)E.రామాంజినేయులు, 2) ఎస్.సంధ్యారాణి, 3) జి.శ్రీనివాసులు, 4) E.బాలకృష్ణ అను వారికి చెందుతుందని వీలునామా రాసి ఉన్నారు. వాళ్ళకి భూమిని రిజిస్టర్ చేయమని అనంతపురం హై కోర్టు ఆంధ్రప్రదేశ్ ఆదేశించింది. పై విషయంలో ఎటువంటి అభ్యంతరములు ఉన్న ఏడు రోజుల్లో తెలియజేయాల్సి ఉంది. లేనిచో పై నలుగురికి భూమిని రిజిస్టర్ చేయుటకు ఎటువంటి ఇబ్బంది లేదని ఇందుమూలమంగా తెలియజేయడమైనది.

నేరాలు ఘోరాలు

మెట్ల మీద నుంచి పడి వ్యక్తి మృతి



మృతిచెందిన లక్ష్మీనారాయణ

పుట్లూరు : మండల పరిధిలోని ఎల్లుట్ల గ్రామంలో ఇంటి వద్ద మెట్లు ఎక్కుతూ కింద పడి వ్యక్తి మృతిచెందాడు. శుక్రవారం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రేపల్లె లక్ష్మీనారాయణ (43) మెటికల ఎక్కుతుండగా లో బీపీ కారణంగా తల తిరిగి మెట్ల నుంచికిందికి పడి మృతిచెందినట్లు అక్క లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. శనివారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొన్న లారీ.. ఐదుగురికి గాయాలు

పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడు వద్ద 67వజాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఎడ్లబండిని ఓ లారీ ఢీకొనడంతో ఐదుగురు గాయపడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం గ్రామానికి చెందిన బాలరంగయ్య, రామాంజనేయులు, రాజేశ్వరితోపాటు మరో ఇద్దరు కలిసి ఎడ్లబండిలో గుత్తి మండలం తొండపాడులో జరిగే బాలికొండ రంగనాథస్వామి తిరుణాలకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ఈప్రమాదంలో ఐదుగురికి గాయాలు కాగా ఎద్దుకు తీవ్రంగా గాయపడింది. గాయపడిన వారిని చికిత్స కోసం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటోబోల్తా..

మండలంలోని వీరేపల్లి వద్ద 67వ జాతీయ రహదారిలో శనివారం ఆటో బోల్తా పడటంతో ఏడుగురు గాయపడినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. యాడికి మండలం కేశవరాయునిపేటకు చెందిన గంగమ్మ, రాముడు, అరుణ కుటుంబ సభ్యులతో కలసి ఆటోలో బొలికొండ రంగనాథస్వామి తిరుణాలకు వెళుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఏడుగురు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స కోసం గుత్తిప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలలోని జక్కలచెరువు గ్రామ శివారులో 67వనంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామానికి చెందిన మనోహర్ తొండపాడు గ్రామంలో జరుగుతున్న రంగనాథుడి బ్రహ్మోత్సవాలకు కాలినడకన వస్తున్నాడు. అయితే జక్కలచెరువు గ్రామ శివారులో గుత్తి వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనం వెనుక వైపు నుంచి వేగంగా వచ్చి మనోహర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు విష ద్రావకం తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు వెంకటేష్ కొన్ని రోజులుగా జులాయిగా తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో తండ్రి శ్రీనివాసులు శుక్రవారం రాత్రి తీవ్రంగా మందలించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన వెంకటేష్ ఇంటి నుంచి బయటకు వచ్చేసాడు. కొత్తపేట గ్రామ శివారులో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని వెతుక్కుంటూ అక్కడికి వచ్చి వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ తగిలి మహిళకు గాయాలు

గుత్తి : మండల పరిధిలోని రజాపురం గ్రామ శివారులో కట్టెలు కొట్టే మిషన్ తగిలి లక్ష్మి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంతకల్లు మండలం గుర్రబ్బాడు గ్రామానికి శరత్‌బాబు, లక్ష్మి కట్టెలు కొట్టుకుని విక్రయిస్తూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో శనివారం రజాపురం గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో కట్టెలు కొడుతుండగా కుడి కాలుకు మిషన్ తగిలి తీవ్రంగా గాయపడింది. గమనించిన తోటి కూలీలు లక్ష్మిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

కల్లూరులో భారీ చోరీ

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో శనివారం 28 తులాల బంగారం రూ.50 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రశేఖర్‌రెడ్డి వ్యాపార పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లగా భార్య పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో పని చేయించడం వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని నిందితులు తాళం పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని అనంతపురం డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ గౌస్ పరిశీలించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి వెంటనే అరెస్టు చేస్తామని తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కళ్యాణదుర్గం టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కుందుర్పి

కళ్యాణదుర్గం టిడిపి కార్యకర్తలకు అండగా ఉంటానని ఆ పార్టీ శాసనసభ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు భరోసా ఇచ్చారు. అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ, మాజీ సర్పంచి పెద్ద నరసింహప్ప, మాజీ వైస్ ఎంపిపి రవి కలిసి శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీనివాసులు, మహంతపురం గ్రామవాసులు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.



వైద్య నిమిత్తం కోసం ఆర్థికసాయం అందిస్తున్న టిడిపి నాయకులు

సూర్యనారాయణ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు

ఉరవకొండ : మండలంలోని బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయ హుండీని శనివారం ఆలయ ఆవరణలో లెక్కించినట్లు దేవస్థానం ఇఒ కృష్ణయ్య తెలిపారు. 14 నెలలకు సంబంధించి భక్తుల నుంచి రూ.1.54029 లక్షలు హుండీ ద్వారా ఆలయానికి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ సిఐ తిమ్మయ్య, పెన్నోబిల ఆలయ ఇఒ విజయ్‌కుమార్, విఆర్ఓ కృష్ణకాంత్, అర్చకులు ప్రకాష్‌స్వామి, బసవరాజుస్వామి, గ్రామస్తులు ధనంజయ, ఉపసర్పంచి ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకి ఉత్సవం

ఉరవకొండ : మండలంలోని పెన్నఅహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకిఉత్సవం కార్యక్రమం శనివారం సాయంత్రం వైభవంగా సాగింది. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలవుదీర్చి ఆలయం చుట్టూ ప్రదక్షణ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, ఉరవకొండ అర్బన్ సీఐ తిమ్మయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు రిజిస్ట్రేషన్ పత్రాలు ఓ వరం

కుందుర్పి : రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమని జడ్పిటిసి రాధాస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహాశీల్దార్ కార్యాలయంలో దాదాపు 260 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ హనుమంతు, వైస్ ఎంపిపి భీమ్‌రెడ్డి, సర్పంచులు, మారుతీశ్వరి రామమూర్తి, లలితమ్మ బొమ్మయ్య, విఆర్ఒలు అజిత్‌కుమార్, సంజీవ్‌రెడ్డి, నరసింహమూర్తి, తిమ్మప్ప, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.